క్లుప్తంగా

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీవో

జగిత్యాలరూరల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంపీవో రవిబాబు అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న వెలమ నాయకులు

రాయికల్: షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెలమ సామాజిక వర్గాన్ని అసభ్య పదజాలంతో దూషించడంపై రాయికల్ వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఎస్సై సుధీర్ రావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక ఎమ్మెల్యేగా వెలమ సామాజిక వర్గం మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడటం అతని అవివేకానికి నిదర్శనమన్నారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు యాచమనేని మహేశ్వర్ రావు, దుగ్యాల రమపతిరావు, యాచమనేని కిరణ్, హరీశ్‌రావు, దుగ్యాల రవీందర్, కిశోర్ రావు, శ్రీనివాస్‌రావు, వేణురావు, సంతోష్, సభ్యులు పాల్గొన్నారు.

వరి కొయ్యలు కాల్చితే నష్టాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో వినీల

జగిత్యాలఅగ్రికల్చర్: వరి కొయ్యలను కాల్చడం వల్ల భూమిలోని పోషకాలను పంటకు పనికి రాకుండా పోతాయని జగిత్యాల అర్బన్ మండల వ్యవసాయాధికారి బి. వినీల అన్నారు. జగిత్యాల అర్బన్ మండలంలోని మోతె గ్రామంలో శనివారం వరి కొయ్యలను కాల్చుతున్న రైతులకు వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత పంటకు అందించిన నత్రజని, భాస్వరం, పోటాశ్ పోషకాలు ఆవిరైపోతాయని చెప్పారు. శ్వాసక్రియలో ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. కార్యక్రమంలో ఏఈవో నాగరాజు, రైతులు రవీందర్ రెడ్డి, గంగారెడ్డి, నారాయణ, శంకరయ్య పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే చర్యలు

కోరుట్ల: దుకాణాల్లో ఒక్కసారి వాడి పారవేసే ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి అన్నారు. పట్టణంలో మున్సిపల్ సిబ్బంది శనివారం పలు దుకాణాల్లో సోదాలు నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తున్న దుకాణా యజమానులకు జరిమానా విధించారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, జగదీష్, రాజు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



ఎమ్మెల్సీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జగిత్యాల: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి, ఆర్థిక శాఖ దృష్టికి తీసుకెళ్లి ఉపాధ్యాయ, ఉద్యోగులు, పెన్షనర్లకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బోయినిపల్లి ప్రసాద్‌రావు, నరేందర్‌రావు, శ్రీనివాస్‌రావు, అశోక్ రావుపాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడలు ప్రారంభం

జగిత్యాలరూరల్/ కోరుట్లరూరల్/మల్లాపూర్/ ఇబ్రహీంపట్నం/పెగడపల్లి/కథలాపూర్: సీఎం కప్ క్రీడలు శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పాఠశాలల స్థాయిలో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. పాఠశాలల స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు 10, 11 తేదీల్లో మండల స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమాల్లో ఎంపీడీవోలు, ఎంపీవోలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



జగిత్యాల రూరల్: వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు







కథలాపూర్: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధికారులు వెంకటాపూర్‌లో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు పెగడపల్లిలో ఖోఖో..

అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ

• ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



అర్పపల్లిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

సారంగాపూర్: అర్హులైన ప్రతి రైతుకు రూ. 2 లక్షలు రుణమాఫీ చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని అర్పపల్లి గ్రామంలో రూ. 15 లక్షలతో ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో 30 రోడ్ల అభివృద్ధికి రూ. 1.38 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. సంక్రాంతికి రైతుభరోసా సొమ్మును రైతులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ రాజమల్లయ్య, విండో చైర్మన్ ఏలేటి నర్సింహ్మారెడ్డి, మాజీ జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, నాయకులు సురేందర్, ప్రభాకర్, శేఖర్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీలు అందజేత

జగిత్యాల: సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణానికి చెందిన పలువురు నిరుపేదలకు వైద్య చికిత్స కోసం ఎల్‌వోసీ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు లబ్ధిదారులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, కౌన్సిలర్ కూసరి అనిల్ పాల్గొన్నారు.

పద్మ నాయక వెలమ సంక్షేమ మండలి ప్రమాణ స్వీకారం

జగిత్యాలటౌన్: ఇటీవల ఎన్నికైన జగిత్యాల పద్మ నాయక వెలమ సంక్షేమ మండలి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ వెలమ సంక్షేమ సంఘం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సాగర్‌రావు, కార్యవర్గం, వెలమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జీవన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ వెంకట్



జీవన్‌రెడ్డితో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

జగిత్యాలటౌన్: ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ శనివారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని జగిత్యాల పట్టణంలోని ఆయన నివాసం ఇందిరాభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చంద రాధాకిషన్, ఎన్ఎస్‌యూఐ ప్రెసిడెంట్ చెట్టి భార్గవ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు స్వామిరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతి

కథలాపూర్: మండలంలోని సిరికొండ- తక్కళ్లపెల్లి గ్రామాల మధ్య వాగుపై అసంపూర్తిగా ఉన్న వంతెనను పూర్తి చేయించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చినట్లు జిల్లా రాజు శనివారం తెలిపారు. వాగుపై వంతెన పనులు నిలిచిపోయి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. ప్రత్యేక చొరవ చూపి వంతెన పనులు పూర్తి చేయించి రాకపోకలకు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్సీకి ఇచ్చిన వినతిపత్రంలో కోరారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫేర్‌కు విద్యార్థుల ఎంపిక



జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న హర్షిక

రాయికల్/కథలాపూర్/మల్యాల/గొల్లపల్లి: కథలాపూర్ మండలం తక్కళ్లపెల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన మామిడి శ్రీహిత అనే పదో తరగతి విద్యార్థిని రూపొందించిన ప్రయోగం రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం మోటూరి రవీందర్ శనివారం తెలిపారు. మల్యాల మండలం తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని హర్షిక జిల్లాస్థాయి సైన్స్ ఫేయిర్‌లో పాల్గొని, తన ప్రతిభ చాటి జిల్లాస్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. రాయికల్ మండలంలోని కుమ్మరిపల్లి ప్రాథమిక హెచ్‌ఎం కడకుంట్ల అభయ్‌రాజ్ బోధనోపకరణాల విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఎంఈవో రాఘవులు, పలువురు అభినందించారు. పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన వర్షిని జిల్లాస్థాయి సైన్స్ ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది.

ప్రొసీడింగ్ పత్రాలు అందజేత



ఆర్‌ఎంపీలకు ప్రొసీడింగ్ ఇస్తున ఎమ్మెల్యే

మల్లాపూర్: మండల కేంద్రంలో శనివారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ వివిధ సంఘాలకు అభివృద్ధి నిధుల ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కాటిపెల్లి ఆదిరెడ్డి, బండి లింగస్వామి, ముద్దం శరత్‌గౌడ్, కోమ్ముల జీవన్‌రెడ్డి, చిట్యాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డిక్కీ చైర్మన్

గొల్లపల్లి: దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (డిక్కీ) సంస్థ జిల్లా సమన్వయ కర్తగా నియమితులైన గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన నల్ల శ్యామ్ శనివారం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని దళితుల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తానని శ్యామ్ తెలిపారు.

నవోదయ విద్యాలయాల మంజూరుపై సంబరాలు

మెట్‌పల్లి: నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో కేంద్ర ప్రభుత్వం రెండు నవోదయ విద్యాలయాలను మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ నాయకులు శనివారం సంబరాలు జరుపుకున్నారు. ఈ మేరకు పాత బస్టాండ్ వద్ద ప్రధాని నరేంద్ర మోదీ, ఎంపీ ధర్మపురి అర్వింద్‌ల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి చెట్లపల్లి సుఖేందర్, పట్టణాధ్యక్షులు బొడ్ల రమేశ్, నాయకులు ఉన్నారు.

• **కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు**

మేడిపల్లి: ఉమ్మడి మేడిపల్లి మండలానికి చెందిన మాజీ జెడ్పీటీసీ కుందారపు జలందర్, మాజీ ఎంపీపీ మకిలి ఇజ్రయిల్, మాజీ సర్పంచులు బొంగోని రాజగౌడ్, అంగడి ఆనంద్‌తో పాటు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి దోహదపడాలని సూచించారు .

• **పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు**

జగిత్యాల: పట్టణంలోని అల్ఫోర్స్ విద్యార్థులు శనివారం జగిత్యాల టౌన్‌పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ వేణుగోపాల్ విద్యార్థులకు పోలీస్‌స్టేషన్ గురించి వివరించారు. ఎఫ్ఐఆర్ ఎలా చేస్తారు, లా అండ్ ఆర్డర్ ఎలా చేస్తారో వివరించారు. అత్యవసరం అయితే 100కు ఫోన్ చేయాలని, విద్యార్థినీలైతే షీటీం 1930కు ఫోన్ చేయాలన్నారు. ఎస్సై మన్మథరావు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు విద్యార్థులను శ్రద్ధగా చూడాలి

జగిత్యాల: విద్యార్థులను తల్లిదండ్రులు శ్రద్ధగా కనిపెడుతూ ఉండాలని బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అలియా మక్సూద్ అన్నారు. కళాశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు.విద్యార్థులు ఇంట్లో ఉన్న సమయంలో మొబైల్స్, టీవీ దూరంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు తిరుపతిరెడ్డి, సునీత, శిల్ప, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

• **10న ఉపాధిహామీ సామాజిక ప్రజావేదిక**

రాయికల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 10న ఉపాధిహామీ సామాజిక ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చిరంజీవి శనివారం తెలిపారు.

• **పాఠశాలలో బియ్యం పరిశీలన**

రాయికల్: మండలంలోని ఇటిక్యాల ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వండుతున్న రేషన్ బియ్యాన్ని తహసీల్దార్ ఖయ్యూం శనివారం పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

• **ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలి**

సారంగాపూర్: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా వైద్యాధికారులు, సిబ్బంది కృషిచేయాలని డీఎంహెచ్ డాక్టర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. బీర్‌పూర్, నర్సింహులపల్లె గ్రామాల్లో చిన్నారులకు ఇస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి వైద్యసిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శ్రీనివాస్, జిల్లా ప్రాజెక్టు అధికారి రవీందర్ తదితరులు ఉన్నారు.

• **దరఖాస్తుల ఆహ్వానం**

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్‌లోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న ఏఎన్‌ఎం ఉద్యోగానికి కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అర్బన్ ఎంఈవో భీమయ్య తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన మహిళ అభ్యర్థులై ఉండాలని, ఈనెల 6 నుంచి 8 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆసియా వలస సంఘాల ఐక్యవేదిక డైరెక్టర్ గా భీంరెడ్డి

జగిత్యాలక్రైం: ముప్పయి ఏళ్లుగా అంతర్జాతీయ వలస కార్మికుల హక్కుల కోసం పనిచేస్తున్న మైగ్రంట్ ఫోరం ఇన్ ఏసియా (ఎంఎఫ్ఏ) అనే ప్రముఖ సంస్థకు బోర్డు అఫ్ డైరెక్టర్‌గా తెలంగాణకు చెందిన ప్రముఖ వలస కార్మిక నేత మంద భీంరెడ్డి ఎన్నికయ్యారు. శనివారం థాయిలాండ్ దేశంలోని బ్యాంకాక్‌లో జరిగిన ఎంఎఫ్ఏ సర్వప్రతినిధి సభలో భీంరెడ్డి ఎన్నికయ్యారు.

బాధిత కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులు అందజేత

మల్లాపూర్ : మండల కేంద్రంలో కారత్ అనిత అనే మహిళ క్యాన్సర్‌తో ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబానికి ఉదయం ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం 25కిలోల బియ్యం, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, రూ.1,000 లను అందజేశారు.

సీఎంను కలిసిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు

జగిత్యాలటౌన్: యూత్ కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన బీరం రాజేశ్ శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజేశ్‌ను సీఎం అభినందించి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

ఉమ్మడి జిల్లాస్థాయి నెట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

జగిత్యాలరూరల్: మండలంలోని లక్ష్మీపూర్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు 68వ ఎస్జీఎఫ్ ఉమ్మడి జిల్లాస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ మల్లీశ్వరి తెలిపారు. కాగా ఎంపికైన విద్యార్థులు విష్ణువర్ధన్, అశ్విత, ప్రియ, జగదీశ్వర్‌ను ఎంఈవో గాయత్రి అభినందించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం మద్దెల సరోజన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పూదోట మల్లన్న జాతర



మాజీ ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ కమిటీ

కోరుట్లరూరల్: మండలంలోని అయిలాపూర్ పూదోట మల్లన్న స్వామి జాతర శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు బోనాలను ఊరేగింపుగా తీసుక వెళ్లి స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అంజిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొంతం రాజం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, నాయకులు బద్దం తుక్కారెడ్డి, పిడుగు సందయ్య, తదితరులు పాల్గొన్నారు.



కథలాపూర్: మండలకేంద్రంలో ప్రతీ సోమవారం వారసంత రోడ్డుపైన నిర్వహిస్తున్నారు. వ్యాపారులు, కొనుగోలు దారులు రోడ్డుపైన ఉండటంతో సాయంత్రం వేళ రద్దీగా మారుతుంది. ఆయా గ్రామాలకు వెళ్లే వాహనదారులు, ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. వారసంత కోసం ప్రత్యేకంగా షెడ్లు నిర్మించాలని వ్యాపారులు, కొనుగోలు దారులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శంకర్,ఎంపీడీవో,కథలాపూర్ సెల్ నంబర్: 9281481652

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ ధర్నా



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

ధర్మపురి: కాషాయ జెండాలు, బీజేపీ జెండాలను మున్సిపల్ శాఖ డంపింగ్‌యార్డులో పడేయంపై బీజేపీ నాయకులు శనివారం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ధర్మపురి పట్టణంలో స్తంభాలకు కట్టిన కాషాయ జెండాలు, బీజేపీ జెండాలను మున్సిపల్ సిబ్బంది తొలగించి డంపింగ్‌యార్డులో పడేయడం సిగ్గుచేటన్నారు. రాజుల కాలం నుంచి హిందూ దేవాలయ శిఖరాలపై రెపరెపలాడే కాషాయ ధ్వజాలను తొలగించడంపై తీవ్రంగా ఖండించారు. డంపింగ్‌యార్డులో పడేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు లవన్‌కుమార్, పిల్లి శ్రీనివాస్, ఆకుల శ్రీనివాస్, గాజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీల డ్రామాలను ప్రజలు నమ్మరు



పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న సుజిత్‌రావు

మల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు చేస్తున్న డ్రామాలను ప్రజలు నమ్మరని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, పీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు అన్నారు. మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. వివిధ గ్రామాలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరగా, వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీలన్నింటిని కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి నెరవేరుస్తుంటే బీఆర్‌ఎస్, బీజేపీలు అడ్డుపడుతున్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై, ప్రభుత్వంపై బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు అవాకులు, చెవాకులు పేలితే సహించేది లేదని, హెచ్చరించారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కో-ఆరినేటర్ వాకిటి సత్యంరెడ్డి, పీసీసీ ఫిషర్మెన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్ముల చిన్నారెడ్డి, మెట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిమ్మల రాజు, నాయకులు పాల్గొన్నారు.

• **కులంపేరుతో దూషించిన వ్యక్తులపై కేసు**

జగిత్యాలక్రైం: పట్టణంలోని నలువాల నర్సమ్మ అనే మహిళను కులం పేరుతో దూషించిన ముదుగంటి నిర్మలదేవి ముదుగంటి వెంకట్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై కిరణ్ తెలిపారు. పెగడపల్లి మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన నలువాల నర్సమ్మ మామ మల్యాల మండలం మ్యాడంపల్లి శివారులో కొన్నేళ్ల క్రితం 25 గుంటల భూమిని కొనుగోలు చేశాడు. ఇటీవల ధరణిలో ముదుగంటి నిర్మలాదేవి పేరున ధరణిలో వచ్చింది. దీంతో నర్సమ్మ పలుమార్లు తమ భూమిని తమకు పట్టా చేయాలని కోరగా రేపు మాపు అంటూ కాలం వెళ్లదీశారు. ఈ నేపథ్యంలోనే 25 గుంటల భూమిని సుద్దపల్లి గ్రామానికి చెందిన పన్నాల వెంకయ్యకు రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో ఈ విషయంపై నలువాల నర్సమ్మ ఇటీవల జగిత్యాల పట్టణంలో ఉన్న ముదుగంటి నిర్మలదేవి వద్దకు వెళ్లి నిలదీయగా ఆమె, ఆమె భర్త కులం పేరుతో దూషించారు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్ తెలిపారు.

• **ఓటర్ల జాబితా ప్రదర్శన**

సారంగాపూర్: సారంగాపూర్ మండలంలో మొత్తం 20,013 ఓటర్లు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చౌడారపు గంగాధర్ మండలంలోని మొత్తం 18 గ్రామాల్లో వార్డుల వారిగా పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు జాబితాను ఆయన ప్రకటించి, ప్రజల కోసం పరిశీలనకు ఉంచారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని 17 గ్రామాల్లో 162 వార్డుల్లో 162 పోలింగ్ స్టేషన్ల వారిగా ఓటర్ల జాబితాలను తయారు చేసినట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ శనివారం తెలిపారు. ఈ ఓటర్ల జాబితాలను అన్ని గ్రామాల్లో నోటీస్ బోర్డులో ఉంచినట్లు తెలిపారు.

పెగడపల్లి: గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం మండలంలోని పోలింగ్ స్టేషన్ల డ్రాఫ్టును నోటీస్ బోర్డుపై ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి ప్రదర్శించారు.

• **బీర్‌పూర్ పీహెచ్‌సీకి నేడు భూమిపూజ**

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం మోతీనగర్ శివారుల్లో రూ. 1.43 కోట్లతో ఏర్పాటు చేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సి)కి ఆదివారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ భూమిపూజ చేయనున్నారు. శనివారం అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్‌కుమార్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శ్రీనివాస్‌తో పాటు, స్థానిక తహసీల్దార్ ముంతాజొద్దీన్ పిహెచ్‌సి ఏర్పాటుకు కెటాయించిన ఎకరం స్థలాన్ని వారు పరిశీలించారు. ప్రభుత్వ విప్‌తో పాటు, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కలెక్టర్ సత్యప్రసాద్ భూమిపూజలో పాల్గొంటారని అధికారులు వెల్లడించారు.

• **అడవులను కాపాడడానికి గ్రామస్తులు సహకరించాలి**

సారంగాపూర్: అడవులను కాపాడానికి గ్రామస్తులు సహకరించాలని అటవీశాఖ ధర్మపురి ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనాథ్ అన్నారు. శనివారం బీర్‌పూర్ మండలం తాళ్ల ధర్మారం, కండ్లపల్లి గ్రామాల్లో అడవులను సంరక్షించడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు సహకరించాలని, అడవుల్లో అగ్ని ప్రమాదాల కారణంగా తీవ్ర నష్టం వాటిల్లుతొందని తెలిపారు. కార్యక్రమాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, అటవీశాఖ సెక్షన్ అధికారి గంగారాం, ఆర్ ప్రకాష్, బీట్ అధికారులు నవీన్, కిరణ్‌కుమార్, బేస్‌క్యాంపు సభ్యులు పాల్గొన్నారు.